క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



ఆదివాసీలకు నిత్యావసరాలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాజేష్

రాజవొమ్మంగి: మండలంలోని తెల్లకొండ గ్రామంలో నివసిస్తున్న 70 ఆదివాసీ కుటుంబాలకు సహృదయ ఫౌండేషన్ (పి.గన్నవరం) సోమవారం నిత్యావసర వస్తువులను అందజేసింది. సంస్థ వ్యవస్థాపకులు పైడి రాజేష్ తన చేతుల మీదుగా ఆయా కుటుంబాలకు బియ్యం, కిరాణా సామగ్రి, రగ్గులు, దుస్తులు అందజేశారు. ప్రాజెక్టు-2024 పేరుతో జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. సభ్యులు సీతారత్నం, పండు, శ్రీకాంత్, జయపాల్, ఆనందపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



ఏపీవో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

చింతూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం ఐటీడీఏ ఏపీవో కంచర్ల సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. లక్ష్మణ్, సురేష్, భద్రమ్మ, లక్ష్మి, జ్యోతి, మంగాదేవి పాల్గొన్నారు.

నేత్ర సమస్యల పరిష్కారమే లక్ష్యం



కంటి శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖకు తరలివెళ్తున్న రోగులు

చింతపల్లిరూరల్: నేత్ర సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్టు ఐకేర్ మేనేజింగ్ డైరెక్టర్, కన్సల్టెంట్ ఆప్తాలమిస్ట్ డాక్టర్ గాలి జగన్ అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మంది గిరిజనులను ఐటీడీఏ ఆధ్వర్యంలో మెరుగైన కంటి శస్త్రచికిత్సల కోసం సోమవారం విశాఖపట్నం తరలించినున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి కంటి సమస్యలున్నా చింతపల్లి ప్రాథమిక ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. ఆస్పత్రికి రాలేని దివ్యాంగులు, వృద్ధులు ఇతరులు 7013407421 నంబర్‌ని సంప్రదిస్తే వైద్యులే వారి వద్దకు వస్తారని తెలిపారు.డాక్టర్ రుక్మిణి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ప్రసాద్

కొయ్యూరు: మండలంలోని పెదమాకవరం బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ (పరీక్ష ప్యాడ్‌లను)లను ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డి.వి.డి.ప్రసాద్ అందజేశారు. దాన ధర్మ చారిటబుల్ సంస్థ సహకారంతో అందించిన అట్టలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. క్రమశిక్షణతో చదవాలన్నారు. హైందవ సైన్యం జిల్లా కార్యదర్శి కె.నాగేశ్వరరావు, టీటీడీ ధర్మ ప్రచారక్ ప్రతినిధి డి.పద్మరాజు, హెచ్‌ఎంలు రాంబాబు, దేవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

నేడు పశువులకు టీకాలు

దుంబ్రిగుడ: అరకు సంతబయలు గ్రామంలో మంగళవారం మూగజీవులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నట్టు వెటర్నరీ అసిస్టెంట్ శెట్టి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు ఎటువంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

గిరిజన సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న పాడేరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



కర్రాయిగుడలో ఓలేక్ మహిళ దేవునికి పూజలు చేస్తున్న అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం

- శివారు గ్రామాలకు రహదారులు
- గ్రామాల్లో పర్యటించిన పాడేరు, అరకు వైఎస్సార్‌సీపీల సమన్వయకర్తలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం
- గిరిజనుల ఘన స్వాగతం

గూడెంకొత్తవీధి: గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందని పాడేరు పాడేరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎం.విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని పెదవలస, అకవరపుపేట, దేవరాపల్లి పంచాయతీలో ఆయన సోమవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు సైతం రహదారులు నిర్మించడంతో చాలా వరకు డోలీమోతలు తప్పాయన్నారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జగనన్న ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు.ప్రజలు నాటి నేటి ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకోవాలన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏదైనా కావాలంటే జన్మభూమి కమిటీల ముందు దేహీ అంటూ మోకరిలాల్సి వచ్చేదన్నారు. కాని నేడు సీఎం జగనన్న పాలనలో ప్రజలకు ఏమి కావాలో వలంటీర్లు నేరుగా ఇళ్లకు వచ్చి సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. నాడు పింఛన్ కోసం పండుటాకులు పడిన కష్టాలు చెప్పలేని విధంగా ఉండేవన్నారు. ఇప్పుడు తెల్లవారక ముందే ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు తప్పుడు హామీలు నమ్మవద్దన్నారు. సంక్షేమ, సుపరిపాలన అందిస్తున్న జగనన్నకు అందరూ అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.రామకృష్ణ, ఎంపీటీసీలు సత్యనారాయణ, కె.నారాయణ, పెదవలస, లకవరపుపేట, కించురు సర్పంచ్‌లు వంశీకృష్ణ, వీరేంద్రప్రసాద్, వంతల రామారావు,మాజీ జిల్లా కార్యదర్శి జల్లి సుధాకర్, ప్రస్తుత జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్, మాజీ సర్పంచ్ నర్సింగరావు, నాయకులు శరభన్నపడాల్, ప్రసాద్, ఉర్దుబ్, నారాయణ పాల్గొన్నారు

సీఎం జగనన్న పాలన దేశానికే ఆదర్శం

అనంతగిరి: జగనన్న మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి గెలిపించి, మన మారుమూల గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని, అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని కొనపురం పంచాయతీ కర్రాయిగుడ గ్రామానికి సమన్వయకర్త హోదాలోని మొదటిసారిగా విచ్చేసిన రేగం మత్స్యలింగంనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఓలేక్ మహిళ దేవునికి గిరిజన ఆచారా సంప్రదాయంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నిర్వహించిన కార్యక్రమంలోని రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి జరుగుతోందన్నారు. జగనన్న పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ ఓలేక్ మహిమ గుడి అభివృద్ధికి తన వంతు లక్ష రూపాయలను ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అరుణ నవీన్, రఘునాథ్, మండల ప్రధాన కార్యదర్శి దానియేలు, కో-ఆప్షన్ సభ్యుడు మదీనా, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ గంగులు, ఉపాధ్యక్షుడు కొర్రా సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ఎంఈవో-2 శ్రీనివాసరావు

అడ్డతీగల: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గణనీయమైన ఉత్తీర్ణత శాతం నమోదు చేయడానికి విద్యార్థులచే ముమ్మర కసరత్తు చేయిస్తున్నట్టు ఎంఈవో-2 పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో పది ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు సన్నాహకంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు 10 పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే పాఠ్యాంశాలు అన్ని పూర్తి కాగా పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టామన్నారు.అడ్డతీగల మండలంలోని రాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 11 మంది, డి.భీమవరం ఆశ్రమ ఉన్నత పాఠశాల-32 మంది, అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-73 మంది, అడ్డతీగల గురుకుల ఉన్నత పాఠశాల-74 మంది, అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల-80 మంది, అడ్డతీగల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల-28 మంది, ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-36 మంది, గొంటువానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-41 మంది, వెదురునగరం జి.వి.వి.కె.హెచ్.ఎస్. పాఠశాల నుంచి 25 మంది విద్యార్థుల పరీక్షలకు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల ఉన్నత పాఠశాల, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.

పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ రామసత్యవతికి సన్మానం



పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ రామసత్యవతిని సన్మానిస్తున్న పార్టీ నేతలు తదితరులు

పాడేరు : పాడేరు వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) గా నియమితులైన లకే రామసత్యవతిను సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల కార్యవర్గంతో పాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్‌పర్సన్ మినుముల సరస్వతి, డోకులూరు సర్పంచ్ కుర్రబోయిన సన్నిబాబు, ఎంపీటీసీలు సల్లా చిట్టమ్మ, కుంతూరు నర్సింహమూర్తి, ఇతర నాయకులు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒకరు విశేష కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు పిలుపునిచ్చారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



విద్యార్థినులను పరీక్షిస్తున్న డాక్టర్ సునీల్ కుమార్

కూనవరం: విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా అనారోగ్య సమస్యలు చాలా వరకు దరిచేరవని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని కోతులగుట్ట కేజీబీవీ పాఠశాలలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో 100 విద్యార్థినులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వంటశాలను పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆర్వోప్లాంట్‌ను పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ అనారోగ్యంపై నిర్లక్ష్యం చేయెద్దని, తప్పకుండా సమీపంలో ఆస్పత్రి వెళ్లి డాక్టర్లను సంప్రదించాలన్నారు. డాక్టర్ రాజీవ్, సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుజాత, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల రోడ్‌షో విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తోట రాజేశ్వరరావు

దేవీపట్నం: మండలంలోని ఈనెల 10న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్(అనంతబాబు)లు రోడ్ షో ర్యాలీ నిర్వహించనున్నట్టు అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం ఇందుకూరుపేట, పోతవరం, శరభవరం, ఇందుకూరు, ఫజుల్లబాద్ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. రోడ్‌షో విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించి కార్యకర్తలను సమాయత్తం చేశారు. ఎంపీపీ కుంజం మురళి, కందుల బాబ్జి, సత్యనారాయణ, మురళీ, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

గంగవరం : స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ వైద్య నిపుణులు వస్తున్నారని, వారు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందిస్తారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ జోడిగుమ్మ, కొసంపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజేశ్వరి సోమవారం తనిఖీలు చేశారు.రికార్డులను పరిశీలించారు. కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళాలు అంతా ఆరోగ్యంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

గ్రామాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటు

మారేడుమిల్లి : పుల్లంగి పంచాయతీ పరిధిలోని చెలకవీధి, అద్దరివలస -2 గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జార్జిబాబు కోరారు. ఆధార్ కార్డుల నమోదు, కార్డులోని వివరాలు మార్పు. పలు సమస్యలు పరిష్కరించనున్నట్టు తెలిపారు. గుంద్రతిలో మంగళవారం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తారని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుల్లంగి పంచాయతీ సెక్రటరీ కిషోర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



టేకులబోరులో ఎస్‌బీఐ సేవలపై కళాజాత ప్రదర్శన

కూనవరం: భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ రకాల స్కీమ్‌ల గురించి రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కళాజాత ద్వారా సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. టేకులబోరు, పెదార్కూరు, జగ్గవరం, కొత్తూరులో సోమవారం ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సంసర్భంగా ఎస్‌బీఐ టేకులబోరు బ్రాంచ్ మేనేజర్ కనకారావు మాట్లాడుతూ ఆర్థిక, అక్షరాస్యత పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌బీఐ తుని రీజినల్ మేనేజర్ ఆదేశానుసారం మెజీషియన్ మ్యాజిక్ షో, వీధీ నాటిక, జానపద గీతాలతో పలు స్కీమ్‌లను వివరించారు. యానో యాప్ వినియోగం, నగదు రహిత లావాదేవీలు, బంగారంపై రుణాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, వివిధ మార్కెట్ స్కీమ్‌లను కళాజాత ద్వారా వివరించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు



చింతపల్లి తహసీల్దార్ రాధాకృష్ణ మూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీటీ రాజ్‌కుమార్, సిబ్బంది



వై.రామవరం తహసీల్దార్ నాగరాజుకు అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది



వీఆర్ పురం తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌కు అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది



రాజవొమ్మంగి తహసీల్దార్ సత్యనారాయణ



కూనవరం తహసీల్దార్ మురళీకృష్ణ

- తహసీల్దార్లు, ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



ముంచంగిపుట్టు తహసీల్దార్ రఫీజాన్



రంపచోడవరం తహసీల్దార్ కృష్ణజ్యోతి



అడ్డతీగల తహసీల్దార్ నాగమణి



మారేడుమిల్లి తహసీల్దార్ రమణారావు



ఎటపాక ఎంపీడీవో మురళీకృష్ణ



రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



అరకు తహసీల్దార్ సోమేశ్వరరావు



అనంతగిరి తహసీల్దార్ నరసింహమూర్తి



దుంబ్రిగుడ ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అరకులోయటౌన్: అల్లూరి జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలకు ప్రభుత్వం ఇటీవల తహసీల్దార్లు, ఎంపీడీవోలను నియమించింది. వారు సోమవారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రెవెన్యూ పరంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సిబ్బంది, గ్రామస్తులు, నాయకులు అభినందించారు. అరకులోయ తహసీల్దార్‌గా పి.సోమేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. డీటీ మత్స్యరాజు, ఆర్ఐ శోభ మత్స్యరాజు, సిబ్బంది స్వాగతం పలికారు.

అనంతగిరి: మండల తహసీల్దార్‌గా సూరు నరసింహమూర్తి బాధ్యతలు స్వీకరించారు. మన్యం జిల్లా సీతంపేట మండలం నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రాంబాయి విజయనగరం జిల్లా జామి మండలానికి బదిలీపై వెళ్లారు.

ముంచంగిపుట్టు: మండల తహసీల్దార్‌గా అజ్జు రఫీజాన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు విజయనగరం జిల్లా బాడంగి తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

చింతపల్లిరూరల్: చింతపల్లి తహసీల్దార్‌గా రాధాకృష్ణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన లత్సపాత్రుడుని శ్రీకాకుళం జిల్లా కోటబోమ్మాళికి బదిలీ అయ్యారు. ఆయనకు డీటీ రాజ్‌కుమార్, సిబ్బంది స్వాగతం పలికారు.

రంపచోడవరం: మండల తహసీల్దార్‌గా ఎ.కృష్ణజ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో తహసీల్దార్‌గా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. డీటీ బి.రాజు, ఆర్ఐ విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు చెల్లాయమ్మ, ఇందిరాబాయ్. సాయి, వీఆర్‌ఓలు, సిబ్బంది తదితరులు తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

అడ్డతీగల: మండల తహసీల్దార్‌గా పి.నాగమణి బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం నుంచి ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు.

వై.రామవరం: మండల తహసీల్దార్‌గా ఎన్.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏలూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. డీటీ కె.సుధాకరరావు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

మారేడుమిల్లి: మండల తహసీల్దార్‌గా అల్లాది వెంకటరమణారావు బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నుంచి బదిలీపై ఈయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసరావు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు.

రాజవొమ్మంగి: మండల తహసీల్దార్‌గా డి.వి.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా కామవరపుకోట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వై.వి. సుబ్రహ్మణ్యాచారి దేవరాపల్లికి బదిలీ అయ్యారు.

వీఆర్ పురం: మండల తహసీల్దార్‌గా సయ్యద్ మౌలానా ఫాజిల్ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

కూనవరం: మండల తహసీల్దార్‌గా ఆర్.వి.మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా లింగాలపల్లి నుంచి ఇక్కడికి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కె.అనసూయ కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్‌డీఓ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు.

ఎంపీడీవోలు...

దుంబ్రిగుడ: ఎంపీడీవోగా చంద్రం బాధ్యతలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

ఎటపాక: మండల ఎంపీడీవోగా మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా చింతలపూడి నుండి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు కూనవరం ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ ఎటపాక ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రాజవొమ్మంగి: మండలం ఎంపీడీవోగా ఎల్.యాదగిరీశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటేషన్‌పై ఎంపీడీఓగా పనిచేస్తున్న విజయరంగారావు తిరిగి అడ్డతీగలకు బదిలీ అయ్యారు.

సమష్టిగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కూడా రాజుబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. డలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు సాధ్యమన్నారు. పంచాయతీల పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులు మంజూరైనా స్థానిక నాయకులకు సమాచారం అందించి కలిసి పనిచేయాలని కోరారు. గ్రామల్లో ప్రభుత్వం అనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఎంపీడీవో వెంకటరావు, ఈవోపీఆర్డీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు అందుబాటులో పుస్తకాలు



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు

పెదబయలు: పెదబయలు జిల్లా శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నట్టు గ్రంథాలయ అధికారి ఓ.శ్రీనివాసరావు తెలిపారు.ఉమ్మడి జిల్లా గ్రంథాలయం నుంచి పుస్తకాలు పంపించారని మండలంలోని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం గ్రంథాలయంలో పాఠకులకు సదుపాయాలు కల్పనకు గాను రూ.20 లక్షలతో నూతన భవనం నిర్మించినట్టు చెప్పారు. యువత, విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

15న వాలీబాల్ టోర్నమెంట్

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ సూరిమెట్ట గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ఈ నెల15న నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో బొయితిలి, కిల్లంకోట, లువ్వాసింగి, నుర్మతి, పెదబయలు మండలంలో లింగేటి, బొంగరం, ఇంజరి, గిన్నెలకోట, జామిగూడ, ముంచంగిపుట్టు మండలంలో కుమడ, బూసుపుట్టు పంచాయతీల్లో వాలీబాల్ టీమ్‌లు సంబంధిత మహిళా పోలీస్‌ల వద్ద రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. క్రీడాకారుల ఉన్న గ్రామాల్లోని వలంటీర్ల ద్వారా, మహిళా పోలీసుల ద్వారా, సీఐ, ఎస్ఐ ద్వారా రిజిస్టర్ చేసుకోనే అవకాశం ఉందన్నారు. పోటీల్లో గెలిపొందిన ప్రథమ విజేత టీమ్‌కు రూ.20,000, రెండో బహుమతి రూ.15,000, మూడో బహుమతి రూ.10,000 చొప్పున నగదు బహుమతి ఉంటుందన్నారు. ప్రతీ టీమ్‌కు వాలీబాల్, నెట్, క్రీడల్లోని టీమ్ సభ్యులకు ట్రాక్‌లు ఇవ్వనున్నట్టు ఎస్ఐ తెలిపారు. మరిన్ని వివరాలకు 9440904222, 944090221 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

14న అష్టభైరవ మందిరం ప్రారంభం

వై.రామవరం: మండలంలోని వెదురునగరంలోని శివసాయి భువనేశ్వరి ఆశ్రమ దేవాలయాల ప్రాంగణంలో నిర్మించిన కిరాత వారాహి సమేత అష్టభైరవ సాధన మందిర ప్రారంభోత్సవం ఈనెల 14న నిర్వహించనున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు సాయిరామ్ గురుస్వామి చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆరోజు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉదయం 9గంటలకు ఆలయ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు ఆశ్రమ ప్రాంగణంలో హోమాలు, అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.